ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
మంగళవారం 15 ఏప్రిల్ 2025



ఊరిస్తున్న మామిడి



- కార్బైడ్‌తో మగ్గుతున్న పండ్లు
- ఖర్చుకు భయపడి ఇథలీన్‌కు దూరం



సిరిసిల్ల మార్కెట్‌లో కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడి పండ్లు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల) పండ్లలో రారాజు మామిడి... మార్కెట్‌లోకి వస్తున్న మామిడి పం డ్లను చూస్తేనే నోరూరుతుంది. మామిడి ఈసారి ఆశాజనకంగానే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి పండ్లు వస్తున్నాయి. కిలో రూ150 ధర పలుకు తున్నాయి. ఎక్కువ ధరకైనా పండ్ల కొనుగోలు చేస్తున్నారు. మామిడి తోటలు లీజుకు తీసుకున్న వ్యాపారులు వడగండ్ల వర్షాలను దృష్టిలో పెట్టుకుని అప్పుడే కోతలు మొదలు పెట్టారు. కార్బైడ్ రసాయనాలతో మాగబెడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రధానంగా సిరిసిల్ల, వేములవాడ మార్కెట్‌లో మెరుస్తూ కనిపిస్తున్న పండ్లను చూసి సంబురపడుతున్నా రసాయ నాలతో మగ్గించడంతో కొత్త రోగాలు తెచ్చుకుంటామనే భయం కూడా వెంటాడుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మండీలను ఏర్పాటు చేసి కృతిమంగా కాల్షియం కార్బొనేట్‌తో మాగబెడుతూ జిల్లాలోని వివిధ మండలాలకు సరఫరాకు సిద్ధం చేశారు.

తియ్యని పండు విషతుల్యం

తియ్యని పండ్ల వెనక విషం దాగి ఉంది. వివిధ ప్రాంతాల నుంచి మామిడి కాయలను దిగుమతి చేసుకుని రసాయనాలతో మాగబెడుతు న్నారు. జిల్లాలో అహార భద్రత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మామిడి పండ్లే కాకుండా ఇతర పండ్లు కూడా కృతిమ పద్ధతుల్లోనే మాగబెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. సిరిసిల్లలోని చుట్టుపక్కల మామిడి తోటల నుంచి వ్యాపారులు గుత్తగా మామిడి కాయలను తీసుకవచ్చి నిషేధిత కార్బైడ్ రసాయనాలను వాడుతూ పండ్లను మాగబెట్టడం వల్ల ఇతర పండ్ల కంటే మిల మిలా మెరుస్తూ ఉండ డంతో ఎక్కువ ధరకు అమ్మకాలు సాగిస్తున్నారు. కార్బైడ్ ఇతర రసాయ నాలతో మాగబెట్టిన పండ్లు తినడం వల్ల అనేక రోగాలకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. అల్సర్, కాలేయం, క్యాన్సర్, గొంతునొప్పి, రక్తహీనత, కిడ్నీ, నరాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని తినడం వల్ల అనేక రోగాలు వస్తుండడం దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు గతంలోనే వీటిని నిషేధించింది. కార్బైడ్‌తో మాగబెట్టిన పండ్లను తినడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది.

మాగబెట్టిన పండ్లను ఇలా గుర్తించాలి

కాయలను కార్బైడ్ ద్వారా మాగబెట్టి, రంగు మార్చి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వీటిని గుర్తించడానికి నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడి పండ్లపై ఆకుపచ్చని మచ్చలుఉంటాయి. పసుపు వర్ణం ఎక్కువగా ఉంటుంది. ఈ పండు తినే సమయంలో నోట్లో కొంచెం మంట ఉంటుంది. కడుపులో నొప్పి, గొంతు నొప్పి, డయేరియా ఉంటే కార్బైడ్ వాడినట్లుగా గుర్తించవచ్చు. సహజ సిద్ధంగా మాగితే అకుపచ్చ, పసుపు రంగులు కలిసినట్టుగా ఉంటుంది. పండును కోసినపుడు గుజ్జు ఎరుపు, పసుపు కలిసినట్టుగా ఉంటుంది. పండ్లలో రసం ఎక్కువగా ఉంటుంది. తొడిమ లోపటికి కృంగినట్లుగా ఉంటుంది.



ఇథలీన్ గ్యాస్‌పై అవగాహన కరువు

కాల్షియం కార్బైడ్ రసాయనం వినియోగించడాన్ని 2012 మార్చిలోనే అప్పటి ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధించింది. నిషేధం ఉన్నా వాడకం మాత్రం ఆగడం లేదు. ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా ఆహార కల్తీ నిరోధక శాఖలు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. నిషేధిత కార్బైడ్ సరఫరా జరుగుతున్నా రైతుల్లో కూడా అవగాహన కల్పించడంలేదు. కాల్షియం కార్బైడ్‌కు బదులు ఇథలీన్ గ్యాస్ ద్వారా పండ్లను మాగబెడితే ఆరోగ్యకరంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. మాగబెట్టే గదులను ఉపయోగించాలని తెలిపింది. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వం రైపనింగ్ చాంబర్‌లను ఏర్పాటుకు రాయితీ కూడా కల్పిస్తున్నారు. కానీ ఇథలీన్ వాడకం, రైపనింగ్ చాంబర్‌ల ఏర్పాటుపై అధికారులు అవగాహన కల్పించడం లేదు. రైపనింగ్ చాంబర్ ద్వారా ఇథలీన్ గ్యాస్‌ను వదిలి పండ్లను మూడు రోజుల పాటు మాగబెడుతారు. దీనివల్ల పండ్లు సహజ సిద్ధంగా మాగినట్లు ఉండడంతో పాటు మంచి రంగుతో పాటు రుచి ఉంటుంది. ఈ పండు ఆరోగ్య కారకం. కానీ ఇథలీన్ గ్యాస్ ఉపయో గించడం వల్ల ఖర్చు పెరుగుతుందని రైతులు ఉపయోగించడం లేదు.

పండ్ల తొక్కతీస్తే మంచిది

పండ్లను తినేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. శుభ్రంగా మంచినీటితో కడగాలి. ఉప్పుతో కలిపిన నీటితో కడగడం మంచిదని సూచిస్తున్నారు. వీలైనంత వరకు పండ్ల తొక్కను తీసి తినడం వల్ల ఉపయోగకరంగా ఉంటుంది.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ మహేశ్ బి.గీతే

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమ వారం నేటి నుంచి ఈ నెల 20 వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14, 1944లో ముంబాయి విక్టోరియా డాక్‌యార్డ్‌లో ఒక నౌకకు అగ్ని ప్రమాదం సంభవించి విధి నిర్వహణలో అసువులు బాసిన 66మంది అగ్నిమాపక దళ సిబ్బంది స్మార కార్థం ప్రతి ఏటా వారోత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ఈ వారోత్సవాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ ఎస్. నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- గరిష్ట ఉష్ణోగ్రత 42.9 డిగ్రీలుగా నమోదు

సిరిసిల్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. వేడికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 19.7 డిగ్రీలుగా ఉండగా గరిష్ట ఉష్ణోగ్రత 42.9 డిగ్రీలుగా నమో దైంది. అంబేద్కర్ జయంతి సెలవు దినం కావడంతో ప్రభుత్వ కార్యాలయా లు, పాఠశాలలకు సెలవు కావడంతో ప్రజలు కూడా ఇంటికే పరిమితం అయ్యారు. జిల్లా కేంద్రంలో ప్రధాన కూడళ్లు వెలవెలబోయాయి. గరిష్ట ఉష్ణోగ్రతల్లో వేములవాడ రూరల్‌లో 42.9 డిగ్రీలు ఉండగా రుద్రంగి, సిరిసి ల్లలో 41.9 డిగ్రీలు, ఇల్లంతకుంటలో 41.8, కోనరావుపేటలో 41.7, వీర్నపల్లిలో 41.6, గంభీరావుపేట, బోయినపల్లిలో 40.7, ఎల్లారెడ్డిపేటలో 40.2, చందు ర్తిలో 40.1, ముస్తాబాద్‌లో 39.9, వేములవాడలో 39.5, తంగళ్లపల్లిలో 39.4 డిగ్రీలుగా నమోదైంది.

నేత కళాకారుడికి మంత్రి పొన్నం సన్మానం



విజయ్‌ని అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బంగారు పట్టుచీరలను నేసిన సిరిసిల్ల చేనేత కళాకారుడు నల్ల విజయ్‌ను సోమవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. నల్ల విజయ్ నేసిన అగ్గిపెట్టిలో చీర, శాలువా అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, సోనియాగాంధీ, రాహల్‌గాంధీ, మీరాకుమార్‌లకు అందించిన విష యాన్ని పొన్నం గుర్తు చేశారు. నేత కళాకారులకు అండగా ఉంటామన్నారు.

వేములవాడ దేవస్థానం విస్తరణలో అనువంశిక అర్చకుల సహకారం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రాన్ని యాదగిరిగుట్టలాగే విస్తరిస్తున్న దశలో ఆలయ ఆనువంశిక అర్చక ప్రతినిధులు, వేదపండితులు, ఆగమ శాస్త్ర నిపుణుల సలహాలను తీసుకొంటామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చినట్లు ఆలయ ఆనువంశిక అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వేములవాడ ఏరియా టెంపుల్ టౌన్ డెవలప్ మెంట్ అథారిటీ కార్యదర్శిగా నియామకం చేసామని, వారు ఉపాధ్యక్ష హోదాలో ఈ అథారిటీలో ఉన్నారని, సుమారు 150 కోట్ల రూపాయల రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌తో వేములవాడ దేవాలయం విస్తరణ పనులు కొనసాగిస్తామని విప్ ఆదిశ్రీనివాస్ తెలిపారని ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్



జోగాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ తిరుపతి

చందుర్తి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం రామరావుపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తూ, చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ అనూష, ఏఎంసీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, పిఏసిఎస్ కార్యదర్శి శ్రీ వర్ధన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి,నాయకులు గణేష్, ముకుంద రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రంజిత్, సింగిల్ విండో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

చందుర్తి: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ చిలకల తిరుపతి అన్నారు. చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో ఐకెపి సెంటర్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రజిత,మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశం,మాజీ ఎంపీటీసీ మ్యాకల గణేష్, డైరెక్టర్లు అమర బండ సాయి, శ్రీనివాస్ కరీం, శంకర్, మధు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాదులకు సన్మానం



సీనియర్ న్యాయవాది నాగుల సత్యనారాయణను సన్మానిస్తున్న న్యాయవాదులు

వేములవాడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు సీనియర్ న్యాయవాదులను సన్మానించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా తొలుత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీనియర్ న్యాయవాదులను, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా పనిచేసిన సీనియర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీలు బొడ్డు ప్రశాంత్ కుమార్, పుప్పాల భానుకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారతరత్న అంబేద్కర్ అందరివాడు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి



సిరిసిల్లలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న విప్ ఆది శ్రీనివాస్



ప్రోత్సాహం అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):భారత రాజ్యాంగ నిర్మాత భారత రత్న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ అందరివాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా భారత రత్న అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గీతే, గ్రంధాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపరెడ్డి, తెలంగాణ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కత్తెర దేవదాస్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి రాగుల రాములు, అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాల రాజు, ప్రముఖ న్యాయవాది కొల్లూరి ధర్మేందర్‌లతో పాటు పలువురు పూల మాలలు వేశారు. అనంతరం సభా వేదిక వద్ద అంబేద్కర్ చిత్రప టానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. జిల్లాలో కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు రూ. 2.50 లక్షల బాండ్‌లను అం దించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి గ్రామం, పట్టణాల్లోనే కాకుండా పలు దేశాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. అంబేద్కర్ అశయ సాధనకు అందరం కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళుతుందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, బిల్లు శాసనసభలో అమోదించిందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ బిల్లు ప్రవేశపెట్టారని దానిని బలపరిచే అవకాశం బీసీ బిడ్డగా తనకు రావడం మరిచిపోలేని అనుభూతి అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ కూడా అమలు కానుందని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఎస్సీ స్టడీ సర్కిల్ నిర్మాణానికి ఒక ఎకరం భూమి, నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజామనోహర్ రావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు విజయలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సెస్ డైరెక్టర్ కోట్టిప్లల సుధాకర్, మన తెలంగాణ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రాగుల జగన్, తెలంగాణ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకల కమలాకర్, వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంగ శివరాజ్, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు తంగళ్లపల్లి దేవయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు అవునూరి వెంకటరాములు, ఎరుకల సంఘం అధ్యక్షుడు సుల్తాన్ చంద్రయ్య, సేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు గజన్‌లాల్‌నాయక్, దళిత సంఘాల నాయకులు కొమ్ము బాలయ్య, అందె సుభాష్, తిరుపతి, కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాష్, గడ్డం నర్సయ్య, సంగీతం శ్రీనివాస్, గోలి వెంకటరమణ, కాముని అనిత, చంద్రకళ, సూర దేవరాజు, మున్నూరు కాపు సంఘం అధ్యక్షు లు బొప్ప దేవయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అంబేద్కర్‌కు వివిధ పార్టీల నివాళులు

సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటి, న్యాయవాదులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మహిళా సంఘం అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ అడెపు రవీందర్, జిల్లా ఉపా ధ్యక్షుడు శీలం రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజి రెడ్డి, అన్నల్‌దాస్ వేణు, బర్కం నవీన్‌యాదవ్, కర్నె హరీష, గజభీంకార్ చందు, పండుగ మాధవి, దుమాల శ్రీకాంత్, ఊరగొండ రాజులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి, బీఆర్‌ఎస్ కార్యాలయంలో చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేశారు. జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కార్యదర్శి మ్యాన రవి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

- ఎస్పీ మహేశ్. బి.గీతే



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ బి గీతే

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని ఎస్పీ మహేశ్ బి.గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఆయన అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక వివక్షను జయించి ఆత్యున్నత విద్యను సాధించిన గొప్ప మేధావి అన్నారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా ఉండడానికి కీలక పాత్ర పోషించిన వ్యక్తి భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అన్నారు. భారతదేశ అభివృద్ధికి , అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. నేటి యువత ఆయన ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

100% స్వచ్ఛమైన పల్లినూనె

★ రుచికరమైన వంటలకు, పచ్చళ్ళ కొరకు మా పల్లి నూనె వాడండి. వెంకటసాయి అయిల్ మిల్, మానకొండూర్ (డోర్ డెలివరీ సౌకర్యం కలదు) సెల్ : 94405 17139
AJK-238011

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్: 9703618691, 99854 10640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

బైక్‌ను ఢీకొట్టిన కారు

● ముగ్గురికి తీవ్రగాయాలు



గాయాలపాలైన క్షతగాత్రులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ దైవదర్శనానికి వచ్చి తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో రోడ్డు పక్కన బైక్‌పై ఆగివున్న వ్యక్తులను మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్ స్పీడ్‌గా వచ్చి ఢీకొట్టాడు. వేములవాడ మండలం అనుపురం గ్రామశివారులో ఆదివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజీపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్ తన భార్య రజిత, కొడుకు అభిరామ్‌తో కలిసి వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. తిరిగి తమ ద్విచక్రవాహనంపై అర్ధరాత్రి ఖాజీపూర్ వెళుతున్న క్రమంలో అనుపురం గ్రామం వద్ద ఆగారు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి వేములవాడకు వస్తున్న ఓ కారు రోడ్డుపక్కన ద్విచక్రవాహనం పక్కన నిల్చుని ఉన్న వెంకటేశ్, రజిత, కొడుకు అభిరామ్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటేశ్, అభిరామ్ కాళ్లకు తీవ్రగాయాలు కాగా, రజిత తలకు గాయాల య్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఉన్న ముగ్గురిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా

● ముగ్గురికి తీవ్రగాయాలు



బోల్తా పడిన ఆటో

శంకరపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన కూలీలు సోమవారం ఆటోలో కూలీపనికి వెళ్లివస్తుండగా ఆముదాలపల్లి శివారులోని బ్రిడ్జి వద్ద ఆటో అదుపుతప్పి బ్రిడ్జి కింద పడిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్‌కు చెందిన కనకం అంజయ్య ఆటోలో అతని భార్య సారమ్మ, కోడళ్లు నందిని, సంగీతతోపాటు కుక్కముడి వీరయ్య, అతని భార్య ఎల్లమ్మ, మాతంగి మధురమ్మ, మాతంగి శంకరమ్మ తీసుకొని ఉదయాన్నే వీణవంక మండలం కాపులపల్లెకు మొక్కజొన్న కంకి పొత్తు తీయడానికి వెళ్లారు. పనిముగించుకొని తిరిగి వస్తుండగా, ఆముదాల పల్లి శివారులో బ్రిడ్జి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న 8మందిలో ఐదుగురికి గాయాలు కాగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ ఆటోడ్రైవర్ అంజయ్య, మధురమ్మ, శంకరమ్మను 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైనవైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించి నట్లుసమాచారం.మిగిలినవారుసమీపఆస్పత్రిలోచికిత్స పొందుతున్నారు.

పిచ్చికుక్కల దాడిలో 14మందికి గాయాలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో సోమవారం పిచ్చికుక్కలు దాడిచేసి 14 మందిని గాయపర్చినట్లు మోరపల్లి గ్రామస్థులు తెలిపారు. గాయపడ్డ వారిని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అధికారులు స్పందించి వెంటనే పిచ్చికుక్కల బారి నుంచి కాపాడాలని మోరపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.



తరలుతున్న టేకు కలప

ఎస్సారెస్పీ స్థలంలో టేకు వనం

పట్టించుకోని అధికారులు

ఓదెల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని ఎస్సారెస్పీ టేకువనం దొంగల పాలవుతుంది. 15 యేళ్ల క్రితం నాలుగు గుంటల భూమిలో దాదాపు 150 టేకు మొక్కలు నాటారు. వీటికి సరైన రక్షణ చర్యలు చేపట్టలేదు. దీంతో 50 చెట్ల వరకు ఎండిపోగా, మిగిలిన 100 చెట్లు వృక్షాలుగా మారుతుండగా ఒక్కొక్క చెట్టు దొంగల పాలవుతున్నాయి. మూడేళ్ల క్రితం ఎస్సారెస్పీ క్యాంపులో కొందరు గ్రామస్థులు నివాసం ఉండడంతో టేకు వనానికి రక్షణగా ఉండేది. వారు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి మారడంతో విలువైన టేకు కలప మాయమైపోతుంది.

రెండేళ్ల క్రితం గాలి దుమారానికి రెండు పెద్ద చెట్లు నేల కూలి పోగా అవి దొంగల పాలయ్యాయి. మిగిలిన వాటిని రక్షణ లేకపోవడంతో రాత్రి వేళలో మిషన్‌లతో చెట్లను కోసి తీసుకెళ్తున్నారు. దీంతో వనంలో చెట్ల మోడులు దర్శనమిస్తున్నాయి. మిగిలిన వృక్షాలను వేలం వేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో నెలకొక్క టేకు చెట్టును కట్టర్లతో కోసుకెళుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో భవనాల నిర్మాణం అధికమవడంతో టేకు కలపకు డిమాండ్ పెరిగింది. దీంతో ఒక్కొక్క చెట్టు చోరీకి గురవుతోంది. టేకు కలప చోరీ ఇంటి దొంగ లా లేక బయటి దొంగల పనా అనే అనుమానాలను గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. ఎదిగిన చెట్లను వేలం వేసి దొంగల పాలవకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రహరీ నిర్మిస్తాం : ఏఈఈ రాజు



ఎస్సారెస్పీ భూమిలో సర్వేయర్‌తో కొలతలు వేయించి, లేఅవుట్ ఏర్పాటు చేస్తాం. ఎస్సారెస్పీ భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి చెట్లు చోరీకి గురికాకుండా చూస్తాం. నిధుల కోసం ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాం.

టేకు కర్రను విక్రయించాలి

వేయి గండ్ల తిరుపతి, గ్రామస్థుడు, పొత్కపల్లి



టేకు కర్ర దొంగల పాలవక ముందే విక్రయించి ఎస్సారెస్పీ మండల కార్యాలయంలో తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. లేకుంటే టేకు వనాన్ని కాపాడేందుకు క్యాంపులో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలి.

హార్వెస్టర్ ఢీకొని మహిళ మృతి

● మొట్లపల్లిలో విషాదం



కనకమ్మ(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మొట్లపల్లి గ్రామానికి చెందిన దాసరి కనకమ్మ(50), రాగుల వసంత (45) సోమవారం భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లెలో కూలీకి వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తున్న సమయంలో వెంకట్రావుపల్లి శివారులో హార్వెస్టర్ ఢీకొనగా దాసరి కనకమ్మ అక్కడి క్కడే మృతిచెందింది. రాగుల వసంతకు తీవ్రగాయాలు కాగా 108ద్వారా చిట్యాలకు తరలించినట్లు బాధితుల కుటుంబ సభ్యులు తెలిపారు. పనికి వెళ్లి కనకమ్మ మృతి చెంది వసంతకు తీవ్రగాయాలు కావడంతో వారితో పనికి వచ్చిన తోటి కూలీల రోదనలు మిన్నంటాయి.

కోడెలను తరలిస్తున్న వాహనం పట్టివేత

సుల్తానాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని గడ్చిరోలి నుంచి ఎడ్లను తరలిస్తున్న వాహనాన్ని సుల్తానాబాద్‌లో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గడ్చిరోలి నుంచి నాలుగు ఎడ్లను ఒకట్రాలీలో తరలిస్తుండగా సుల్తానాబాద్‌కు చెందిన భూసారపు సంపత్, పృథ్వీ బండారు సూర్య పట్టుకుని పోలీసులకు అప్పగించారు.



పట్టుబడిన వాహనం



రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఘనంగా రథోత్సవం

గంగాధర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలం కొట్లనర్సింహులపల్లిలో సోమవారం లక్ష్మీ నర్సింహస్వామి, సీతారామ చంద్రస్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల రథోత్సవం ఘనంగా సాగింది. అనంతరం ఉత్సవమూర్తులను గరుడ, ఆంజనేయ, అశ్వవాహనములపై ఆలయ పునఃప్రవేశం చేశారు. పండితులు శేషహోమం, మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, ఏకాంతసేవ తదితరాలు నిర్వహించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టుచేసినట్లు రూరల్‌ఎస్సై మారుతి తెలిపారు. జగిత్యాల జిల్లాకు చెందిన రాకేష్, సాయి కిరణ్, బీహార్‌కు చెందిన సనీల్ దాదాపు 100 గ్రాముల గంజాయిని తరలి స్తుండగా ఫాజుల్‌నగర్ గ్రామంలో వారిని పట్టుకుని అరెస్టుచేసినట్లు తెలిపారు. రూరల్‌సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మారుతి తెలిపారు.


గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడి మృతి

మల్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని దివ్యాంగ యాచకుడు(45) దుర్మరణం చెందాడు. మృతుడికి కుడి కాలు మోకాలు వరకే ఉండగా కొండగట్టులో యాచిస్తూ జీవిస్తున్నాడు. నిత్యం రహదారి పక్కనే పడుకునే యాచకున్ని సోమవారం వేకువజామున గుర్తు తెలియని వాహనం తలపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలు అయి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు డయల్ 100కు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచి కేసు నమోదు చేశారు.

శివరాంపల్లి దర్గాలో గుప్తనిధుల కోసం తవ్వకాలు

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

● కేసు నమోదు



దర్గాలో తవ్విన గుంత

సైదాపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాంపల్లి దర్గాలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరపడం కలకలం రేపుతోంది. వివరాలలోకి వెళ్తే.. సైదాపూర్ మండలంలోని శివరాంపల్లి దర్గాలో గుప్తనిధుల కోసం కొందరు వ్యక్తులు తవ్వకాలు చేపట్టారు. ఫ్లోరింగ్ పగుల గొట్టి గుంతలు తవ్వారు. గ్రామంలో కొందరు ముస్లింలు దర్గాకు దర్శనం కోసం వెళ్లగా దర్గాలో లోతైన గుంతలు ఏర్పడి ఉన్నాయి. దీంతో వారు అనుమానం ఉన్న వారిని పిలిపించి అడుగగా పొంతనలేని సమాధానం చెప్పడంతో ఆదివారం అదే గ్రామానికి చెందిన సయ్యద్‌సర్దార్ అనేవ్యక్తి సైదాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. మా గ్రామంలోని దర్గాలో గుప్తనిధుల తవ్వకాలు జరిగాయన్నారు. దీనికి కారణం కరీంనగర్‌కు చెందిన గౌసియా బేగం, ఆమె కుమారుడు యాకుబ్ పాషా, ఆమె కోడలు నేహాలే కారణమన్నారు. వారు కొన్ని రోజులుగా దర్గాపరిసరాలలో కనిపిస్తున్నారని, దర్గాకమిటీ అనుమతి లేకుండా వారు అక్రమంగా దర్గాలోకి ప్రవేశించి దర్గా లోపల గుప్త నిధుల కోసం తవ్వకాలు చెపట్టారన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. సయ్యద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

రేషన్ బియ్యంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

● గోదావరిఖని వన్‌టౌన్‌లో కేసు నమోదు

కోల్‌సిటీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ షాపుల్లో సన్నబియ్యం పేర ప్లాస్టిక్‌బియ్యాన్ని పంపిణీ చేస్తుందంటూ గోదావరిఖనికి చెందిన ఒక వ్యక్తి సోషల్ మీడియాలో ఒక వీడియో పోస్టు చేయడం కలకలం రేపింది. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఒక డ్యాన్స్ ఇన్స్టిట్యూట్ నిర్వాహకుడు తిలక్‌నగర్‌లోని ఒక రేషన్ షాపులో మేము తీసుకున్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వచ్చిందంటూ నాలుగు రోజుల క్రితం సోషల్ మీడియాలో వీడియో పెట్టాడు. ప్రజలారా ఆరోగ్యం జాగ్రత్త అంటూ హెచ్చరించాడు. కిలో బియ్యంలో 100గ్రాముల ప్లాస్టిక్ బియ్యం అంటూ ఆ వీడియోలో పేర్కొన్నాడు. విజయ్ ఎంజే కొరియో గ్రాఫర్ అకౌంట్‌పై ఈ పోస్టు పెట్టడంతో వైరల్‌గా మారింది. దీనిపై సివిల్ సప్లయి అధికారులు విచారణ జరిపారు. గోదావరిఖని పట్టణంలోని పలు రేషన్ షాపుల్లో సోమవారం ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సివిల్‌సప్లయి డిప్యూటీ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా కూడా ఎలాంటి కల్తీ ఆనవాళ్లు లేవని డీఎస్‌ఓ పేర్కొన్నారు. ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించడం ద్వారా ప్రభుత్వాన్ని, పౌరసరఫరాలశాఖను బదనాం చేసేందుకు ఈపోస్టు పెట్టినట్టు భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దీనిపై పౌరసరఫరాల శాఖ డీటీ రవీందర్‌రెడ్డి సోమవారం సాయంత్రం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. పోలీసులు విచారణ ప్రారంభించడంతో పోస్టుపెట్టిన వ్యక్తి సోషల్ మీడియాలో వెంటనే ఆ పోస్టును డిలీట్ చేశాడు.

అర్చకుల మధ్య వివాదంతో ఆలయానికి తాళం

● పోలీసుల జోక్యంతో తెరుచుకున్న ఆలయం

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలో ఇద్దరు అర్చకసోదరుల మధ్య నెలకొన్న వివాదంతో సోమవారం ఆలయానికి తాళం పడింది. జగిత్యాలలోని నిజామాబాద్ రోడ్డులో గుట్ట రాజేశ్వరస్వామి ఆలయానికి దేవాదాయ శాఖ గుర్తింపుఉంది. ఈఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తగా, అర్చకులుగా ఇద్దరు సోదరులు వ్యవహరిస్తున్నారు. దేవా దాయ కమిషనర్ ఉత్తర్వులమేరకు ఓ సోదరుడితో పాటు అతడి ఇద్దరు కుమారులు ప్రస్తుతం అర్చకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో మరో సోదరుడు సోమవారం ఆలయానికి తానే అర్చకుడినని తన వద్ద జీవో ఉందంటూ గుడిమెట్ల మార్గంలో ఉన్న గేటుకు తాళం వేశాడు. దీంతో మరో సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తాళం తీయించారు. దీంతో సమస్య తాత్కాలికంగా సర్దుమణిగింది. అయితే ఇద్దరి అర్చకులమధ్య వివాదంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. ఈవిషయంపై దేవాదాయశాఖ ప్రత్యేక దృష్టిసారించాలని పలువురు భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి: ఎనిమిది మందిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లో ఓ పేకాట స్థావరంపై సోమవారం రాత్రి టౌన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఈదాడుల్లో ఎనిమిదిమంది ప్రముఖులను పట్టుకొని వారివద్ద రూ.30,930 నగదు, 8మొబైల్‌ఫోన్‌లు,52కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. విద్యానగర్‌లోని ప్రముఖ నాయకుడి ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు పక్కాసమాచారం మేరకు తనిఖీ చేశామన్నారు. ఈతనిఖీల్లో 8మంది పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి పీఆర్టీయూ ఆర్థికసాయం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఔట్ సోర్సింగ్‌లో ఒకేషనల్ టీచర్‌గా పనిచేస్తున్న బంధారపు నవీన్ కుమార్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడంతో ఆ కుటుంబానికి పీఆర్‌టీయూ నాయకులు సోమవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. పీఆర్‌టీయూలో క్రియాశీలక సభ్యత్వం కలిగిన నవీన్‌కుమార్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని పీఆర్‌టీయూ టీఎస్ మాజీ అసోసియేట్ అధ్యక్షుడు వంగ మహేందర్ రెడ్డి నవీన్‌కుమార్ సతీమణి కిరణ్మయికి చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గన్నమనేని శ్రీనివాసరావు, ఎడ్ల కిషన్, ట్రైబల్ టీచర్ ఫెడ రేషన్ నాయకులు భూక్య అజ్జునాయక్, మండల ప్రధాన కార్యదర్శి బూర్ల సత్యనారాయణ, ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సప్తగిరి కాలనీలో దొంగతనం

● 17.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదు చోరీ



విచారణ చేస్తున్న సీఐ సృజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సప్తగిరికాలనీలో ఆదివారం అర్ధరాత్రి భారీ దొంగతనం జరిగింది. 17.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.35వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల వివరాల ప్రకారం.. సప్తగిరి కాలనీకి చెందిన నేరెల్ల రమేష్‌గౌడ్ ఆదిలాబాద్ భుక్తాపూర్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం కరీంనగర్‌లో బంధువుల ఇంటిలో శుభకార్యానికి హాజరైన రమేష్‌గౌడ్ దంపతులు రాత్రి సప్తగిరి కాలనీలోని తమ ఇంటికి చేరుకున్నారు. వేసవికావడంతో ఇంటికి రెండు వైపుల తలుపులు తెరిచి నిద్రించారు. అర్ధరాత్రి వేళ దొంగలు ఇంట్లోకి చొరబడి హ్యాండ్‌బ్యాగ్, బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం బ్యాగ్ చూసుకోగా అందులో బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. బీరువా తెరిచి ఉంది. దుస్తులు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దొంగతనం జరిగినట్లు గ్రహించిన బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన వంగ మల్లయ్య అనే గీత కార్మికుడు సోమవారం తాటి చెట్టు పై నుంచి కిందపడగా తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సుల్తానాబాద్‌ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ తరలించారు. గాయపడిన కార్మికుడిని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ పరామర్శించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

● తప్పిన పెనుప్రమాదం

మల్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని దిగువ కొండగట్టు బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సును వెనుకాల నుంచి వచ్చిన కారు ఢీకొంది. ప్రయాణికులతో ముందుకు కదులుతున్న బస్సును కారు ఢీకొనడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు బారులు తీరగా పోలీసులు ట్రాఫిక్ తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. కాగా ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని స్థానికులు తెలిపారు.

పేదలకు అండగా.. ఆలయ ఫౌండేషన్

● పుట్టిన ప్రాంతంపై మమకారంతో ఐఏఎస్ సేవలు

వీణవంక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రాంతంపై ప్రేమతో ఇక్కడి పేదలను ఆదుకునేందుకు ఐఏఎస్ అధికారి పి నరహరి 2015లో ఆలయ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రెటరీగా పనిచేస్తున్నారు. పలువురు స్థానికులను కో ఆర్డినేటర్లుగా నియమించి వారి ద్వారా ఆపదలో ఉన్నవారికి తమకు తోచిన విధంగా సహాయం అందిస్తున్నారు.

● పలు సేవా కార్యక్రమాలు

ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీణవంక మండలంలోని ఘన్ముక్ల గ్రామంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 400 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులు అందజేశారు. కనపర్తి గ్రామానికి చెందిన కోల రాజయ్యకు జైపూర్ ఫుట్‌ను అందించారు. వల్భాపూర్ గ్రామానికి చెందిన నామని రాజయ్యకు ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందించారు. విద్యార్థులకు కోర్సులపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. పేదంటి ఆడపిల్లల పెళ్లిలకు ఆర్థికసాయం అందిస్తున్నారు. ప్రస్తుతం ఆలయ ఫౌండేషన్‌కు 600మంది వలంటీర్లు ఉన్నారు.

● సేవలు విస్తరిస్తాం..

- గాదె గుణసాగర్, ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్

నిరుపేదలకు ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలురకాల సేవలు అందిస్తున్నాం. రాబోయే రోజుల్లో యువతకు ఉపాధి, విద్యలో ఎక్కువగా సాయం అందిస్తాం. మమ్మల్ని సంప్రదించిన వారికి తప్పకుండా సాయం అందిస్తున్నాం. సేవలు విస్తరించేందుకు ప్రణాళి కలు రూపొందిస్తున్నాం.



ఘన్ముక్లలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న ఆలయ ఫౌండేషన్ సభ్యులు(ఫైల్)

ఆచూకీ తెలపరూ..!

మావోయిస్టు నేత బెజ్జారపు కిషన్ భార్య పుష్ప విన్నపం



భార్య పుష్పతో కిషన్(ఫైల్)

కోరుట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తన భర్త ఎక్కడ ఉన్నాడో ఆచూకీ తెలపాలని మావోయిస్టు నేత బెజ్జారపు కిషన్ భార్య పుష్ప వేడుకుంటోంది. కోరుట్ల పట్టణంలోని నారాయణ-నర్సమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు కిషన్. కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన పుష్పతో ఆయనకు 1976 లో వివాహం జరిగింది. 1978లో జరిగిన జగిత్యాల జైత్రయాత్రలో పాల్గొని సాయుధ పోరాటం వైపు ఆకర్షితుడైన కిషన్ జగిత్యాల కేంద్రంలో బుల్లెట్ వాహన మెకానిక్‌గా పని చేసేవాడు. 1980లో సాయిని ప్రభాకర్ నేతృత్వంలో ఉద్యమం వైపు ఆకర్షితుడైన బెజ్జారపు కిషన్ పీపుల్స్‌వార్ పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లాడని భార్య పుష్ప తెలిపింది. అజ్ఞాతంలోకి వెళ్లిన తన భర్త కిషన్ సమాచారం ఇప్పటికీ తెలియ లేదని వాపోయింది. 2012లో నూతన సంవత్సరం శుభాకాంక్షలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కిషన్ ఫొటోతో రివార్డును ప్రకటించారు. అదే సమయంలో చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కూడా కిషన్‌పై రివార్డును ప్రకటించారు. కిషన్ తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందగా వారి అంత్యక్రియలకైనా వస్తాడని కుటుంబ సభ్యులు ఆశించినా అతను మాత్రం రాలేదు. కిషన్ జాడ కోసం భార్య పుష్ప పలు మార్లు పౌర హక్కుల నాయకులను కలిసినా ఫలితం లేకుండా పోయింది. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఏ ఎన్‌కౌంటర్ జరిగినా ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని కిషన్ భార్య ఆందోళన చెందుతోంది. ఆమె ప్రస్తుతం బీడీలు చుడుతూ కాలం వెల్లదీస్తోంది.



బీడీలు చుడుతున్న పుష్ప

ఫేస్‌బుక్ పోస్టులు పేదల జీవితాల్లో వెలుగులు

- పదేళ్లలో రూ.1.75 కోట్ల విరాళాల సేకరణ
- 26 మంది నిరు పేదలకు ఇళ్ల నిర్మాణం
- ఆదర్శంగా నిలుస్తున్న సామాజిక సేవకుడు రమేష్



విరాళాలతో అప్పటి కలెక్టర్ రవి చేతుల మీదుగా సైకిళ్ల పంపిణీ చేయిస్తున్న సామాజిక సేవకుడు రమేష్ (ఫైల్)

విద్య, వైద్యానికి సహాయం

పదేళ్లలో రమేష్ 141 మంది నిరుపేదలకు రూ.1.75 కోట్ల విరాళాలను పంపిణీ చేయించారు. వాటిలో 26 మంది పేదలకు ఇళ్ల నిర్మాణం చేయించగా, మిగిలిన పేదలకు విద్య, వైద్యం కోసం సాయం అందించారు. 200 మంది నిరుపేద విద్యార్థుల కోసం సైకిళ్ల పంపిణీ చేయించారు. కేవలం ఒక ప్రాంతానికో, ఒక జిల్లాకో పరిమితం గాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలోని నిరుపేద ప్రజల కోసం రమేష్ ఫేస్‌బుక్‌ను వినియోగిస్తున్నాడు. దాతల ద్వారా సాయం అందిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు రమేష్.

ధర్మపురి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో కొందరు సోషల్ మీడియాను కాలక్షేపానికి, మరికొందరు వినోదం కోసం వినియోగిస్తున్నారు. అందుకు భిన్నంగా జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ ఫేస్‌బుక్‌ను పేద ప్రజలకు సాయం చేయడానికి వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. 2015 సంవత్సరంలో సేవా కార్య క్రమాలు ప్రారంభించిన రేణికుంట రమేష్ ఇప్పటి వరకు 141 మంది నిరుపేద కుటుంబాలకు రూ.1.75 కోట్ల విరాళాలను దాతల ద్వారా పంపిణీ చేయించారు.

దశాబ్ద కాలంగా సమాజ సేవ

ధర్మపురి మండలం బురుదేశిపల్లె గ్రామానికి చెందిన రాగుల వైష్ణవి అనే విద్యార్థిని పదేళ్ల క్రితం అనారోగ్యానికి గురై మంచానికే పరిమితం అయ్యింది. బ్రెయిన్ ఆపరేషన్ చేయాల్సి ఉండగా కుటుంబ సభ్యులు నిరుపేదలు కావడం వల్ల వైద్యం చేయించలేక పోయారు.

ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్న రమేష్ చిన్నారి దీనస్థితిని చూసి చలించిపోయాడు. ఎలాగైనా చిన్నారికి ఆపరేషన్ చేయించాలని రమేష్ అనుకున్నాడు. దీంతో వైష్ణవి ఆరోగ్య సమస్యను, కుటుంబ దీనస్థితిని వివరిస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. స్పందించిన తెలుగు ష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, స్థానికులు, ఇతర దాతలు రూ.9 లక్షలు రూపాయలు పంపించారు. దాతల సాయంతో సర్జరీ చేయించి, మిగతా డబ్బులు బాధితురాలి పేరు మీద బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించాడు.

వైష్ణవికి సాయం చేసిన దాతలు రమేష్‌తో ఫోన్‌లో మాట్లాడి మరెవరైనా నిరుపేదలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రమేష్ ప్రతీ నెల ఓ నిరుపేద కుటుంబాన్ని ఎంపిక చేసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తున్నాడు. ప్రతి నెల చివరలో బాధిత కుటుంబానికి వచ్చిన విరాళాలు, వాటిని ఉపయోగించిన తీరును వివరిస్తూ ఫేస్ బుక్‌లో మరో పోస్టును అప్‌డేట్ చేస్తాడు.

దాతల ఔదార్యంతోనే సేవా కార్యక్రమాలు

రేణికుంట రమేష్, సామాజిక సేవకుడు, ధర్మపురి



దాతల ఔదార్యంతో పదేళ్ల నుంచి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నా. పేదరికంతో పాటు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాల నుంచి ప్రతీ నెల ఒక కుటుంబాన్ని ఎంపిక చేసి వారికి దాతల ద్వారా సాయం అందేలా చూస్తున్నా. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన బళ్లారి మిత్రులు, జగిత్యాలకు చెందిన సత్య సాయి అభయ హస్తం సభ్యులు, హైదరాబాద్‌కు చెందిన సినీ హీరో చిరంజీవి అభిమానులు, స్థానిక దాతలు సాయం అందిస్తున్నారు. పేదలకు సాయం అందించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా.







జగిత్యాలలో అనారోగ్యానికి గురైన బాధిత కుటుంబానికి డిపాజిట్ బాండ్ అందజేస్తున్న ఎస్పీ అనంతశర్మ(ఫైల్), ధర్మపురికి చెందిన పేద మహిళా కుటుంబానికి విరాళాలు అందజేస్తున్న సీఐ (ఫైల్), మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్‌కు చెందిన పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం చేసి ఇచ్చిన సామాజిక సేవకుడు రమేష్ (ఫైల్)

పచ్చదనంతో కనువిందు చేస్తున్న చెట్లు



కొడిమ్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం పూడూర్ రోడ్డులో చెప్యాల క్రాస్ రోడ్డు నుంచి కొడిమ్యాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు మండుటెండలో ప్రయాణికులను పచ్చదనంతో ఆకట్టుకుంటున్నాయి. నిత్యం ఈ రోడ్డుపై నుంచి ప్రయాణించే వారు కాసేపు అక్కడి ఆగి సేద తీరుతున్నారు.

కరెంటు తీగలకు కర్రలే ఊతం



వేలాడుతున్న తీగల కోసం ఏర్పాటు చేసిన కర్రలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల రామిండ్లవాడ నుంచి అక్కపల్లి గ్రామానికి వెళ్లే దారిపై విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదభరితంగా మారాయి. ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. నిత్యం రాకపోకలు సాగించే ఆయా గ్రామాల రైతులు, వాహనదారులు, ప్రజలకు కరెంటు ప్రమాదం పొంచి ఉంది. వ్యవసాయ పొలాలకు సమీపంలో ఉండడం వల్ల రైతులు కిందకు వేలాడుతున్న తీగలకు రెండు కర్రలను ఏర్పాటు చేశారు. గాలి వీచినప్పుడు కర్రలు పడిపోయి ప్రమాదం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిందకు వేలాడుతున్న తీగలకు బిగించిన కర్రలను తొలగించి మరమ్మతులు చేయాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

వెళ్లొస్తాం.. అంజన్నా

జయంతి ఉత్సవాలు ముగియడంతో తిరిగి వెళ్తున్న భక్తులు

హనుమాన్ చిన్న జయంతి ఆదాయం రూ.1.67 కోట్లు



స్వామివారిని దర్శించుకొని తిరిగి వెళ్తున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో జరిగిన హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ముగిసినప్పటికీ సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేలాదిగా భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం నుంచి ఆర్జిత సేవలను యథావిధిగా ప్రారంభించారు. జయంతి ఉత్సవాలు ముగియడంతో ఆర్జిత సేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు యథావిధిగా కొనసాగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

● హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలకు లక్షలాది భక్తులు తరలిరాగా దేవస్థానానికి రూ.1,67,73,800 సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. గతేడాది చిన్న జయంతికి రూ.1,54,13,395 రాగా ఈసారి రూ.13.60లక్షలు పెరిగింది. దీక్ష విరమణల ద్వారా రూ.40,17,500 కేశ ఖండనం టికెట్ల ద్వారా రూ.11.78లక్షలు, శీఘ్ర దర్శనం ద్వారా రూ.18,61,500 ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. రూ. 81,74,600 విలువైన లడ్డూ ప్రసాదాల విక్రయాలు, రూ.15,42,200 విలువైన పులిహోర విక్రయాలు జరిగినట్లు తెలిపారు. ఇందులో లడ్డూ, పులిహోర విక్రయాలు ద్వారా వచ్చిన సొమ్ములు పూర్తి స్థాయిలో ఆదాయం కాకపోయినప్పటికీ అధికారులు ఆదాయంగా పేర్కొంటున్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల వచ్చినవి మినహాయిస్తే రూ.70.57లక్షలు మాత్రమే ఆదాయం వచ్చినట్లు అవుతుంది.

అగ్గి అంటుకుంటే బుగ్గే

- కానరాని ఫైర్‌సేఫ్టీ నిబంధనలు
- ఐదేళ్లలో 275 అగ్ని ప్రమాదాలు
- 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 14((ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు పెరగడంతో అగ్నిప్రమాదాలు ప్రజలను ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజలు అగ్నిప్రమాద నివారణకు జాగ్రత్తలు పాటించాలి. అగ్నిమాపక కేంద్రాల్లో ఆధునిక యంత్రాలు ఉన్నప్పటికీ సిబ్బంది కొరత వెంటాడు తోంది. ఎక్కడా ఫైర్‌సేఫ్టీ నిబంధనలు కనిపించడం లేదు. మంటలను ఆర్పడానికి అవసరమైన నీరు దొరకడం లేదు. జిల్లాలో సోమవారం ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు ఈ నెల 20న ముగియనున్నాయి.



సిరిసిల్లలోని ఫైర్ స్టేషన్

అందుబాటులో అధునాతన యంత్రాలు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ అధునాతన యంత్రాలు ఉన్నాయి. సిబ్బంది కొరత ఉన్నది. సిరిసిల్లలో ఒక అగ్నిమాపక వాహనం, మినీ వ్యాన్, బుల్లెట్‌లు ఉన్నాయి. వేములవాడలో ఒక అగ్నిమాపక వాహనం, ఒక బుల్లెట్ మాత్రమే ఉంది. వీటితో పాటు పోర్టబుల్ పంపులు, బ్రీతింగ్ ఆపరేటర్ సెట్స్, వాటర్, ఫోమ్, పౌడర్, సిఓ2 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. సిరిసిల్లలో ఒక ఫైర్ ఆఫీసర్, ఇద్దరు హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు డ్రైవర్‌లు, ముగ్గురు ఫైర్‌మెన్‌లు ఉన్నారు. వేములవాడలో ఒకఫైర్ ఆఫీసర్, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఇద్దరు డ్రైవర్‌లు, ఇద్దరు ఫైర్‌మెన్‌లు ఉన్నారు. జిల్లాలో ఎక్కడ అగ్ని ప్రమాదం సంభవించినా వెంటనే ఫోన్ నెం. 0872323 2901కు డయల్‌చేసి చెపితే వెంటనే ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను నివారించే అవకాశం ఉంది. జిల్లాలో గత ఐదు సంవత్సరాల్లో 275 అగ్ని ప్రమాదాలు జరిగాయి. దాదాపు రూ.4.61కోట్ల ఆస్తినష్టం సంభవించింది. దాదాపు 5.41కోట్ల ఆస్తులను అగ్నిమాపక సిబ్బంది సంరక్షించారు.



ఇళ్లలో అగ్ని ప్రమాద సూచికలు

ప్రధానంగా ఇళ్లల్లోనే ప్రమాద సూచికలు కనిపిస్తుంటాయి. ఇళ్లల్లో ఉండే చిన్నపిల్లలు అగ్గిపెట్టెలతో ఆటలాడ టం, ఇంట్లో గ్యాస్ స్టౌ ఆన్‌చేసి మరిచిపోవడం, కిరోసిన్, పెట్రోల్‌లు ఇంట్లో నిల్వచేయడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం దీపారాధన చేసి ఇంటికి తాళం వేసి మరిచిపోతే అగ్గిరాజుకుంటుంది. దీపాలకు వేడిమి ఎక్కువై ఇల్లంతా మంటలు వ్యాప్తి చెందుతాయి. ఇళ్లల్లో విద్యుతు స్విచ్‌బోర్డులు ప్రతి ఏడాది మరమ్మతు చేయించుకోవాలి. స్విచ్‌బోర్డుల వల్ల షార్ట్‌సర్క్యూట్ సంభవిస్తుంది.

ప్రజల్లో అవగాహన కల్పిస్తాం

ఎన్. నరేందర్, ఫైర్ ఆఫీసర్, సిరిసిల్ల



జిల్లాలో అగ్నిప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తాం. వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వారం రోజుల్లో అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ, నియంత్రణ చర్యలపై వివిధ రూపాల్లో ప్రదర్శనలు ఇస్తాం. పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తాం. ఫైర్‌స్టేషన్‌లలో ఆధునాతన యంత్రాలు ఉన్నాయి. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు తీసుకున్నాం.

అగ్నిప్రమాదాలకు నెలవు

ఎండ తీవ్రతకు అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా గడ్డివాములు, గుడిసెలు, ఇతర వ్యర్థపదార్థాల కారణంగా ఎక్కువగా మంటలు వ్యాపిస్తాయి. వీటి సమీపంలో ఎవరైనా సిగరెట్, బీడీలు తాగి పారేసి వెలితే అగ్గిరాజుకుంటుంది. ఇవేకాకుండా పత్తి, మిరప, కంది, తదితర పంటలు కోసిన తర్వాత కట్టె కాలబెడుతుంటే మంటలు వ్యాపించే అవకాశం ఉంది. ఈ మంటలు పొలాల గట్లపై ఉన్న గడ్డివాములకు అంటుకుంటాయి. ఇవేకాకుండా అడవులు అంటుకొని కాలిపోతుంటాయి. మరోవైపు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భవనాల్లో మంటలు వ్యాపిస్తున్నాయి.

నివారణ చర్యలు

- వంటింటి పైభాగాల్లో గాలి వెలుతురు ఉండేలా చూడాలి
- గ్యాస్‌ట్యూబ్‌ను మార్చుకోవాలి
- సిలిండర్ వాడకం పూర్తియిన వెంటనే రెగ్యులేటర్ ఆపివేయాలి
- మండుతున్న స్టౌవ్‌లో కిరోసిన్ పోయవద్దు
- వంటిగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ ఉంచకూడదు.
- స్కూల్, షాపింగ్ కాంప్లెక్స్, ఆస్పత్రులలో ఆర్‌సిసి కాంక్రీట్ స్లాబులనే పైకప్పుగా వాడాలి.
- ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి.
- గడ్డివాములను నివాస గృహాలకు దూరంగా వేయాలి.

భక్త జనసంద్రం

- వేములవాడలో భక్తుల రద్దీ
- రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



వేములవాడలో బారులు తీరిన భక్తులు



ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పుణ్యక్షేత్రం సోమవారం భక్తులతో జనసంద్రంగా మారింది. రాష్ట్రం నలు మూలల నుంచి వచ్చిన భక్తులు రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మ దర్శ నం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తు లను దర్శించుకునేందుకు సుమారుగా మూడుగంటల సమయం పట్టింది. శీఘ్ర దర్శనం, బ్రేక్ దర్శనం క్యూ లైన్‌ల ద్వారా ఆలయంలోకి వెళ్లిన భక్తులు ముందుగా శ్రీలక్ష్మీగణపతిని, తరువాత రాజన్నను దర్శించుకున్నారు. తదనంతరం శ్రీ పార్వతిదేవి అమ్మవారికి ఒడిబియ్యం పోస్తూ అమ్మ వారిని వేడుకున్నారు. కోడెమొక్కును చెల్లించుకుని తరించారు. శ్రీ భీమేశ్వర, నగరేశ్వర, శ్రీబద్ది పోచమ్మ అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమ య్యారు. భక్తులకు ఇబ్బందులు తలేత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్‌లు, సూపరిండెంట్‌లు వరి నర్సయ్య, నరేందర్, రాజేందర్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న ఏపీ, రాజస్థాన్, తెలంగాణ న్యాయమూర్తులు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఏ. హరిహరనందశర్మ, రాజస్థాన్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎం. లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎన్. తుకరాంజీలు దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు రాజన్న ఆలయానికి రావడంతో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఘనస్వాగతం అందించగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. సోమవారం ఉదయం అర్చకులు న్యాయమూర్తులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీస్వామి వారి ప్రత్యేక పూజ అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. కాగా ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో శ్రీస్వామి వారి శేషవస్త్రం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట సిరిసిల్ల జిల్లా జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, స్థానిక ఎమ్మార్వో విజయ్ ప్రకాశ్‌రావు, ఏఈవో అశోక్‌కుమార్ శ్రీకాంత్‌చారి తదితరులు ఉన్నారు.



కోడెమొక్కు చెల్లించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తులు

తాళ్లపెల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) మండలంలోని తాళ్ళపెల్లి గ్రామంలో సీసీరోడ్డు పనులను బీజేపీ నాయకుడు పల్లె సాయిప్రసాద్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. గ్రామంలో సీసీరోడ్డు కావాలని గ్రామస్తులు కోరగా కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బండి సంజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, స్వామి, శ్రావణ్, మహేష్, శ్రీకాంత్, కార్తీక్, వెంకటరాంరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యరెడ్డి, హరీష్, కనుకయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

ఉగాది పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న తిరుపతి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన తునికి తిరుపతి ఆంధ్రప్రదేశ్‌లో ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపూరంలో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కవిసమ్మేళనం జరిగింది. కవిసమ్మేళనంలో తిరుపతి అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. దీనితో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందించారు. ఇల్లంతకుంటలోని వాణీనికేతన్ హైస్కూల్ పనిచేసే తిరుపతికి అవార్డు రావడం పట్ల ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయులతో పాటు గ్రామస్థులు అభినందనలు తెలిపారు..

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని సారంపల్లి, బద్దనపల్లి, పద్మనగర్, ఇందిరమ్మ కాలనీలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 11 కేవీ లైన్ మెయింటనెన్స్ కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా శ్రీరామచంద్రస్వామి రథోత్సవం

గంభీరావుపేట ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలో శ్రీ సీత రామచంద్రస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా సోమవారం జరిగింది. గంభీరావుపేటలోని పురాతన రామాలయంలో శ్రీరామనవమి నుంచి అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారిని అశ్వ, గజ, పొన్న, హను మాన్, సేవలపై ఊరేగించారు. ఆదివారం శ్రీ రామచంద్ర స్వామి గరుడ సేవపై భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం శ్రీ రామచంద్ర స్వామి రథోత్సవం భక్తుల కన్నుల పండుగ సాగింది.

మానవ హక్కుల కమిటీ మండల చైర్మన్‌గా శ్రీనివాస్



ఇల్లంతకుంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కాసుపాక శ్రీనివాస్‌ను జాతీయ మానవ హక్కుల కమిటీ మండల చైర్మన్‌గా నియమిస్తున్నట్లు జిల్లా చైర్మన్ మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో ప్రజల హక్కులను కాపాడడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు

జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో విజేత విలాసాగర్

బోయినపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపూర్ గ్రామంలో గత నెల రోజులుగా పిఏసిఎస్ మాన్వాడ చైర్మన్ వేసి రెడ్డి దుర్గారెడ్డి ఆధ్వర్యంలో నెల రోజులుగా జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. సోమవారం ఫైనల్ పోటీల్లో విలాసాగర్ వర్సెస్ మల్లాపూర్ పోటీ పడగా విలాసాగర్ విజేతగా నిలిచింది. పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 16 టీంలు పాల్గొన్నాయి. ప్రథమ ద్వితీయ స్థానాలు పొందిన విలాసాగర్ మల్లాపూర్ టీం లకు జిల్లా యువజన సంఘాల నాయకులు బోనాల శ్రీకాంత్ బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విలాసాగర్ పిఈటి ప్రభాకర్, బోయినపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రమేష్, నాయకులు ఆకుల నాగరాజు ఐల మహేష్, కృష్ణ ఐల, రామకృష్ణ ఆడెపు ద్వితీయ చంద్, యూత్ సభ్యులు వేసిరెడ్డి కార్తీక్‌రెడ్డి, ఇసాక్, గొర్రె కిషన్, వేసి రెడ్డి నాగేందర్ రెడ్డి, ఆకుల మధు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం



హైకోర్టు న్యాయమూర్తిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ కార్యవర్గం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి తుకారాంజీని సోమవారం బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాజన్న ఆలయ రెస్ట్‌హౌస్‌లో న్యాయమూర్తిని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, కటుకం జనార్దన్, మనోహర్, మహేందర్, శ్రీనివాస్, మహేష్, జక్కుల పద్మ, బూర సరితలు ఉన్నారు.

యంత్ర ప్రతిష్ఠాపన

కోనరావుపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కొండాపూర్ హనుమాన్ తండాలో సోమవారం శ్రీహనుమాన్ దేవాలయంలో యంత్ర ప్రతిష్ఠాపనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ యంత్ర ప్రతిష్ఠాపనోత్సవాల్లో పురోహితులు కొంచకంటి ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడుకోవాలి



కనగర్తిలో బాలనాగమ్మ నాటక ప్రదర్శన

కోనరావుపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీన కళలను కాపాడుకోవాలని కోనరావుపేట సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో వేణుగోపాలస్వామి కళా మండలిచే రెండు రోజులపాటు నిర్వహించే బాలనాగమ్మ చిరుతల నాటకాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో కళాకారులు ప్రాచీన కళలకు జీవం పోస్తూ నాటక ప్రదర్శన చేయడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల స్వామి కళామండలి నాట్య కళాకారులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



సిరిసిల్ల పెద్దూర్‌లో కేక కట్ చేస్తున్న నాయకులు



ఇల్లంతకుంటలో మాజీ ఎమ్మెల్యే రసమయి నివాళి



సిరిసిల్లలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో వేడుకలు



చింతలఠాణాలో బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, ముష్టిపెల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్ధాపూర్ గ్రామాల్లో వార్డు కార్యాలయాలతోపాటు ఆయా గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలతో పాటు చిత్రపటాలకు అంబేద్కర్ సంఘాలు, యువజన సంఘాలతోపాటు ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలలో మాజీ ఎంపీపీ జుపెల్లి శ్రీలతశ్రీనాథ్ రావు, తాజా కౌన్సిలర్లు భూక్య రెడ్డినాయక్, పోచవేని సత్యఎల్లయ్యయాదవ్, పాతూరి రాజిరెడ్డి, బోల్గం నాగరాజుగౌడ్, కల్లూరి లత, బుర్రలక్ష్మీ, చెన్నమనేని కీర్తి,లింగంపల్లి సత్యనారాయణ, తాజా మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు గోల్లపల్లి బాలయ్యగౌడ్, మార్కెట్‌కమిటి మాజీ వైస్ చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, షేక్ అలీ, మెడుదుల దేవయ్య తదితరులు పాల్గొన్నారు. సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి కమాండెంట్ ఎంఐ సురేష్ పూల మాలు వేసి నివాళ్లుఅర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ రాందాస్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి సీపీఎం అధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లుఅర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, నాయకులు కోడం రమణ, సూరం పద్మ, మిట్టపల్లి రాజమల్లు, నక్క దేవదాస్, అన్నల్‌దాస్ గణేష్ పాల్గొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహంతోపాటు వివిధ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుమాల రమానాథ్‌రెడ్డి, విక్కుర్తి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, జిల్లా కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీధర్, చకినాల రామచంద్రం, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, జిల్లా కోశాధికారి అంబటిరమేష్, జిల్లా కార్యదర్శులు పాముల స్వామి, అడెపు శివకుమార్, కొత్వాల్ ప్రవీణ్, బెజుగం సురేష్ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ మండలంలోని పలు గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని నందికమాన్ చౌరస్తా సమీపంలో ప్రముఖ గాయని విమలక్క ఆదేశాలతో రంగవల్లి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కామ్రెడ్ జార్జిరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాగా వేములవాడ మండల చింతలఠాణ గ్రామంలో బీజేపి మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఇల్లంతకుంట: అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఇల్లంతకుంట మండలంలో సోమవారం జరిగిన వేడుకలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, అంబేద్కర్ సంఘ మండల అధ్యక్షుడు భూమయ్య, నాయకులు అయిలయ్య, మహేందర్ రెడ్డి, పసుల వెంకటి, మామిడి సంజీవ్, గన్నారం నర్సయ్య, రాకేష్, కాసుపాక సురేష్, సిద్దం శ్రీనివాస్, కేవీఎస్‌రెడ్డి, జితేందర్‌గౌడ్, దేవదాస్, మంద రాజు, తిరుపతి, మచ్చ నాగరాజు, శంకర్, రాజలింగం, హన్మంతు పాల్గొన్నారు. మండలంలోని వెల్జీపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని అధ్యక్షుడు తాడూరి లక్ష్మన్ ఆవిష్కరించారు. సోమారంపేట గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించి, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉడుతల వెంకన్న, తడకపెల్లి అర్జున్, సంతోష్‌రెడ్డి, దేశెట్టి శ్రీనివాస్, పర్శరాం పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, మండల బీజేపీ అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను వేర్వేరుగా నిర్వహించారు. జిల్లెల్ల గ్రామంలో మాజీ సర్పంచ్ మాట్ల మధు, కస్బెకట్కూరులో మాజీ సర్పంచ్ వేణుగోపాలరావు నివాళర్పించారు.

గంభీరావుపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో లక్ష్మణ్, ఎంఈవో గంగారాం, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు బాను, అంబేద్కర్ సంఘ నాయకులు రాజవీర్, రాజనర్సు, విజయ్‌కుమార్, చంద్రం, రాజ్‌కుమార్, అభిలాష్, ఉపేందర్, కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటస్వామి, బీజేపీ అధ్యక్షుడు అశోక్, పర్శ హన్మండ్లు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలో అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, ప్రజాసంఘాల నాయకులు అరుణ్ కుమార్, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు ఎడ్ల సాగర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్, ఎమ్మార్వో ముక్తార్ పాషా, ఎంపీడీవో అబ్దుల్ వాజీద్, ఎస్ఐ ఎల్లయ్య గౌడ్ నివాళులర్పించారు. అడవి పదిరలో జాలపల్లి సతీష్-దివ్య దంపతుల కుమారుడు జాలపల్లి దేవాన్ష్ భూమా రియో లియోకి అక్షరాభ్యాసం చేయించారు.



చందుర్తిలో రక్తదానం చేస్తున్న పోలీసులు



ఎల్లారెడ్డిపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బీరయ్య తహసీల్దార్ సురేష్, అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, సంఘాల నాయకులు, బీఎస్పీ నాయకులు కుమ్మరి దేవదాస్, రాజశేఖర్, నరేష్, కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి ఉన్నారు.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంతో వివిధ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి, చిత్రప టాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ చెల్కల తిరుపతి, వైస్ చైర్మన్ బోజ్జ మల్లేశం, నాయకులు అల్లాడి రమేష్ పాల్గొన్నారు.

బోయినపల్లి : బోయినపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాలకు నాయకులు ప్రజలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రుద్రంగి: రుద్రంగి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎస్ఐ అశోక్, కార్యదర్శి రామ్‌దాస్ పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. బీఎస్పీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. మానాల గ్రామంలో అంబేద్కర్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎంసీ చైర్ పర్సన్ సబేరాబేగం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్యలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, సింగారం, కోరుట్లపేట, బండలింగంపల్లి, నారాయణపూర్, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, దుమాల, రాజన్నపేట, తదితర గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అంబేద్కర్ ఆలోచన విధానంతో ముందుకు వెళ్లాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఆది శ్రీనివాస్



అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ రచయిత, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానంతో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణలో భాగంగా నూతన అంబేద్కర్ చౌరస్తా, అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గీతేతో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా వేములవాడలోని అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం తన పూర్వజన్మ సుకృతమని అన్నారు. అంబేద్కర్ చౌరస్తాను రూ. 30 లక్షల అంచనా వ్యయంతో సుందరీకరించి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును శాసనసభలో ఆమోదం తెలిపిందని, 30 సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్న ఎస్సీ వర్గీకరణను అంబేద్కర్ జయంతి నుంచి అమలు చేస్తున్నామని, వేములవాడలో అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎకరం భూమి సేకరించి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధికి గత బడ్జెట్‌లో రూ. 50 కోట్లు, ఇటీవల బడ్జెట్‌లో రూ. 100 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని వెల్లడించారు. వేములవాడ రెండో బైపాస్ రోడ్డులో 80 లక్షలతో కూరగాయల మార్కెట్ సముదాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారాయణ, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, బిజెపి సీనియర్ నేత ప్రతాప రామకృష్ణ, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లిలో కాంగ్రెస్ నాయకులు



అడవి పదిరలో చిన్నారికి అక్షరాభ్యాసం



ముస్తాబాద్‌లో అంబేద్కర్‌కు నాయకుల నివాళి



కోనరావుపేటలో అంబేద్కర్ జయంతి వేడుకలు

రైతులకు భూ సమస్యలు లేకుండా భూ భారతి పోర్టల్



రుద్రంగి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రభుత్వ విప్



వీర్నపల్లిలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులు

రుద్రంగి ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు భూ సమస్యలు లేకుండా ఉండేందుకు భూ భారతి పోర్టల్ ప్రజా ప్రభుత్వం తీసుకువస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి పోర్టల్ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా రుద్రంగి మండల కేంద్రంలోనీ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ఎంతో అధ్యయనంతో తీసుకువచ్చిన భూభారతి చట్టం తీసుకురావడం అభినందనీయం అన్నారు. గతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోకుండా రైతులను న్యాయస్థానాలకు పంపారని. భూభారతి చట్టంలో రెవెన్యూ యంత్రాగమే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం కేవలం వారి స్వంత అవసరాల కోసమే ధరణి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, గడ్డం స్వామి, జక్కు మోహన్, పల్లి గంగాధర్, జక్కు వంశీ, దయ్యాల శ్రీనివాస్, గోపిడి రవీందర్, తదితరులు పాల్గొన్నారు

ఎల్లారెడ్డిపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన భూ భారతి పోర్టల్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని రైతు వేదికలో అధికారులు ఏర్పాట్లు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని విన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ సబేరా బేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు రాజేందర్, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీ, బాలయ్య గణపతి, రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.




రాచర్లబొప్పాపూర్‌లో వీక్షిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం తదితరులు

వీర్నపల్లి : భూ భారతి పోర్టల్ సీఎం రేవంత్‌రెడ్డి శిల్పకళావేదికలో ప్రారంభించగా వీర్నపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, సెస్ డైరెక్టర్ మల్లేశం, మండల వ్యవసాయ అధికారిణి కుమారి జయ, ఏపిఎం నర్సయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భూత శ్రీనివాస్, ఏఇఓలు రమణారావు, దీపిక, రైతులు పాల్గొన్నారు.

సింగిల్ విండో మాజీ చైర్మన్ మృతి

- అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పలువురు నేతలు



లక్ష్మారెడ్డి (ఫైల్)

కోనరావుపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట సింగల్ విండో మాజీ చైర్మన్ కేతిరెడ్డి లక్ష్మారెడ్డి (57) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన కేతిరెడ్డి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీలో మండల కీలక నేతగా కొనసాగుతున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, బీజేపీ కాంగ్రెస్, కమ్యూనిస్టు నాయకులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, కచ్చకాయల బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మల్యాల దేవయ్య, కెంద గంగాధర్, మంతెన సంతోష్, బిజెపి నాయకులు గొట్టే రామచంద్రం, కమ్యూనిస్టు నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, బడే స్వామిదాసు, పలువురు ప్రజాప్రతినిధులు అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబాన్ని ఓదార్చారు. మృతుడికి భార్య మంజుల, కుమారుడు భాగ్యరెడ్డి, కూతురు కీర్తన ఉన్నారు.